# గురుదక్షిణ

- ఎమ్వీ రామిరెడ్డి

సాయంత్రం ఆరు గంటలకే ఫంక్షన్ హాలు దాదాపుగా నిండిపోయింది. ఇంకా జనం వస్తూనే వున్నారు. ముఖ్యమైన వ్యక్తుల్ని ఆహ్వానించేవారు, సాదరంగా తోడ్కొని వచ్చి వేదికకు ముందు వరసలో కూర్చోబెట్టేవారు, కూల్‌డ్రింక్‌లు అందించేవారు, సభ ఏర్పాట్లు పర్యవేక్షించారు... ఎవరి పనుల్లో వారు బిజీగా తిరుగుతున్నారు.

వేదిక విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. అద్భుతమైన అలంకరణతో ఆహూతుల దృష్టిని అయస్కాంతంలా లాగేస్తోంది. కర్టెన్‌కు కట్టిన బ్యానర్‌పై అక్షరాలు మెరుస్తున్నాయి.

"రాష్ట్రపతి విశిష్ట సేవాపతకం పురస్కార గ్రహీత డి.ఐ.జి. ఆంజనేయులు గారికి అభినందన సత్కార సభ'' అన్న అక్షరాలు చదవగానే రాఘవయ్య మాస్టారి కళ్లు మెరిశాయి. గర్వంతో కూడిన దరహాసం ఆయన పెదవులపై విరబూసింది.

ఒక్కసారి హాల్లో జనాన్ని కలియజూశాడు రాఘవయ్య. దాదాపు అందరూ ఉన్నత వర్గానికి చెందినవారే. వస్త్రధారణ, చేతుల్లో సెల్‌ఫోన్లు, ఖరీదైన కళ్లద్దాలు... వారి హోదాలను ప్రకటిస్తున్నాయి. అందరి మధ్యా తనొక్కడే సాధారణ పౌరుడిలా ఫీలయ్యాడు. అయినా డి.ఐ.జి. ఆంజనేయులుకు 'చదువు చెప్పిన గురువు' అనే హోదా తనకుండటంతో వాళ్లందరి కన్నా తనే గొప్ప స్థానంలో ఉన్నట్లు భావించాడు.

ఏడు కావస్తుండగా సభా కార్యక్రమం మొదలైంది. రాష్ట్ర మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు, మేయర్, మున్సిపల్ కమిషనర్, జిల్లా ఎస్పీ, మరో ఇద్దరు నాయకులు వేదికపై ఆసీనులయ్యారు. చివరగా సన్మాన గ్రహీత డి.ఐ.జి. ఆంజనేయులు పేరు పిలవగానే, ఆహూతుల కరతాళ ధ్వనుల నడుమ ఆయన స్టేజీ పైకి వచ్చారు. అందరికీ వినమ్రంగా నమస్కరించి, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీలో కూర్చున్నాడు.

"అంజిగా అంజిగా నారింజగా
అంజిగాడి నోట్లో గంజి పోయంగ
అంగిలంత కాలి ముంజ కొరకంగ..."

ఆరో తరగతిలోనో, ఏడులో ఉండగానో... పిల్లలంతా చేరి ఆంజనేయుల్ని ఆటపట్టిస్తుంటే తను చూశాడు. వారిని మందలించి వెళ్లగొట్టాడు. ఆంజనేయులుకు ధైర్యం చెప్పాడు. అలా నీరసంగా భయంభయంగా వుంటే అందరూ చులకనగా చూస్తారనీ, ఉత్సాహంగా, చలాకీగా ఉండాలనీ హితవు చెప్పాడు.

అందరి మధ్యా అందనంత హోదాలో చెక్కుచెదరని చిరునవ్వుతో కూచున్న ఈ ఆంజనేయులేనా అప్పటి అంజిగాడు! రాఘవయ్య ఆశ్చర్యం నుంచి తేరుకోలేక పోతున్నాడు.

సభా కార్యక్రమం సీరియస్‌గా సాగిపోతోంది. మంత్రిగారు అనర్గళంగా ప్రసంగిస్తున్నారు. విధి నిర్వహణలో ఆంజనేయులు చూపే ధైర్యసాహసాలను ప్రశంసిస్తున్నారు. నక్సలైట్ల ఆగడాలను ఎలా అరికట్టారో అభివర్ణిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతున్న వైనాన్ని వివరిస్తున్నారు. ఇంతగా ఎదిగేందుకు అతను బాల్యంలో అనుభవించిన బాధల్ని ప్రస్తావిస్తున్నారు.

"మేస్టారూ... మేస్టారూ, అంజిగాడు ఏడుస్తున్నాడండీ"- ఇద్దరు పిల్లలు వచ్చి తనకు ఫిర్యాదు చేశారు.

"వాడెక్కడ?"

"గ్రౌండులో ఉన్నాడండి"

తను అక్కడికి వెళ్లాడు. ఆంజనేయులు తన తలను రెండు మోకాళ్ల మధ్య పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. రాఘవయ్య తల నిమిరి, ఓదార్చాడు. కారణం అడిగాడు.

"ఇంతవరకూ మా నాన్న ఫీజు డబ్బులు



ఇవ్వలేదు. రేపుగానీ కట్టకపోతే ఎగ్జామ్స్ రాయనివ్వనని హెడ్మాస్టారు వార్నింగ్ ఇచ్చారు. డబ్బులడిగితే నాన్నేమో చదువు మానేసి తన వెంట పొలం పనుల్లోకి రమ్మంటున్నాడు"- వెక్కిళ్లు పడుతూ చెప్పాడు ఆంజనేయులు.

"ఏడవకు. నేను సాయంత్రం ఇంటికొచ్చి మీ నాన్నకు నచ్చజెబుతాలే"- రాఘవయ్య మాస్టారు భరోసా ఇవ్వటంతో కళ్లు తుడుచుకుని క్లాసులోకి పరుగెత్తాడు ఆంజనేయులు.

పత్తి అమ్ముడుబోక, అప్పులు తీరక తాను సతమతమవుతున్నానని ఆంజనేయులు తండ్రి చెప్పటంతో, ఫీజులవీ రెండేళ్లపాటు తనే కట్టిన సంఘటన గుర్తుకొచ్చింది రాఘవయ్యకు.

పదో తరగతి పూర్తయి, ఆ స్కూలు వదలి

పోయేవరకు తనంటే పడిచచ్చేవాడు ఆంజనేయులు. 'మాస్టారూ... మాస్టారూ...' అంటూ కలవరించేవాడు. ఇంటికొచ్చి కుటుంబంలో ఒకడిలా కలిసిపోయేవాడు.

కాలేజీలో చేరాక రాకపోకలు తగ్గిపోయాయి. క్రమేపీ ఆగిపోయాయి. డిగ్రీ పూర్తయ్యాక ఒకసారి బస్సులో కనిపించి, పలకరించాడు. ఆ తర్వాత ఎప్పుడో వాళ్ల నాన్న కలిసినప్పుడు ఆంజనేయులు ఐ.పి.ఎస్. అధికారి అయినట్లు చెప్పాడు. రాఘవయ్య ఆనందభరితుడయ్యాడు.

రిటైరయ్యాక గుంటూరుకు దగ్గర్లో ఓ పల్లెటూళ్లో ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు రాఘవయ్య. ఆ రోజు పేపర్లో ఆంజనేయులు రాష్ట్రపతి పురస్కారం అందుకున్న సందర్భంగా, గుంటూరులో సన్మానసభ జరుగుతోందన్న వార్త చదివాడు. పాత జ్ఞాపకాలన్నీ పదేపదే ఒత్తిడి చేయటంతో తన శిష్యుడి సన్మాన ఘనతను కళ్లారా చూడాలని సాయంత్రం నాలుగ్గంటలకే బయల్దేరి గుంటూరు చేరుకున్నాడు.

వక్తల ప్రసంగాలు హోరెత్తుతున్నాయి. మధ్యలో ఒక అనౌన్స్‌మెంటు- ప్రసంగాలు పూర్తయ్యాక డి.ఐ.జి. గారికి ఘనంగా సన్మానం ఉంటుందని, వ్యక్తిగతంగా కూడా ఎవరైనా ఆయన్ని సన్మానించవచ్చని!

రాఘవయ్యకు ఓ ఆలోచన తళుక్కుమంది. వెంటనే లేచి, బయటికొచ్చాడు. షాపింగ్ కాంప్లెక్స్ వైపు అడుగులేశాడు.

❖ ❖ ❖

డి.ఐ.జి.ని ముందుగా మంత్రిగారు సన్మానించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు, పోలీసులు... వరసగా వచ్చిపడుతున్న శాలువాల మధ్య గువ్వలా ఒదిగిపోతున్నాడు ఆంజనేయులు. మెడనిండా దండలతో పులకించిపోతున్నాడు.

వేదికపై సందడే సందడి! అందరూ గుమికూడారు.

ఆ సంబరంలోకి రాఘవయ్య కూడా ప్రవేశించబోయాడు. చేతిలో తుపాకులున్న ఇద్దరు పోలీసులు అడ్డుకున్నారు. అంత హడావుడిలోనూ డి.ఐ.జి. ఆ విషయాన్ని గమనించాడు. ఆయన్ని వదిలేయండంటూ సైగలతోనే ఆదేశించాడు.

తన చుట్టూ మూగివున్న జనాన్ని తప్పించుకుంటూ, స్టేజిపై ఆ చివర్న అలాగే నిలబడి చూస్తున్న రాఘవయ్య దగ్గరకు పరుగు పరుగున వచ్చాడు ఆంజనేయులు.

"రండి మాస్టారూ... రండి. ఎంతకాలమైంది మిమ్మల్ని చూసి! బావున్నారా? ఈ సభకు మీరు రావటం నిజంగా నా అదృష్టం" అంటూ ఆంజనేయులు రాఘవయ్య పాదాలకు నమస్కరించాడు.

శిష్యుణ్ణి మనసారా కౌగిలించుకుని, తను కొనుక్కొచ్చిన శాలువాను కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించాడు రాఘవయ్య. ఆంజనేయులు ఆ పుష్పగుచ్ఛాన్ని టేబుల్‌పై వుంచి, మాస్టార్ని ఓ కుర్చీలో కూర్చోబెట్టాడు. తన భుజాలపై వున్న రెండు శాలువాలను తీసి, రాఘవయ్యకు కప్పి, పూలమాలలు వేసి, నమస్కరించాడు.

రాఘవయ్య సంతోషంతో పులకించిపోయాడు.

"ఏం కావాలి సార్?"- షాపులోని కుర్రాడు మరోసారి ప్రశ్నించటంతో, అప్పటిదాకా రాఘవయ్యకు తోడుగా వచ్చిన కల చెదిరిపోయింది.

❖ ❖ ❖

సన్మానాల ప్రహసనం ప్రారంభమైంది.

ముందుగా మంత్రి డి.ఐ.జి.కి శాలువా కప్పి సత్కరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు, మిగతావారు... కొందరు స్థానికులు కూడా వేదికనెక్కి డి.ఐ.జి.ని అభినందన మాలలతో ముంచెత్తుతున్నారు.

రాఘవయ్య లేచాడు. మెల్లగా నడుచుకుంటూ వేదిక వద్దకు చేరుకున్నాడు. మెట్లు ఎక్కబోతుండగా నలుగురు పోలీసులు పరిగెత్తుకొచ్చారు.

"ఏయ్! దిగు... దిగు..." అంటూ గద్దించారు.

అయినా రాఘవయ్య వినకుండా, "అతను నా శిష్యుడు. మాల వేసి ఒక్క నిమిషం మాట్లాడతా"నంటూ వేదికపైకి చేరుకున్నాడు. పోలీసులు వెంబడించారు.

"అదేం కుదరదు. టైట్ సెక్యూరిటీ ఉంది. ముందు మీరు కిందికి దిగండి" అంటూ ఆయన్ని పోలీసులు నెట్టుకుంటూ తీసుకెళుతుండగా, రాఘవయ్య తల వెనక్కి తిప్పి, తన శిష్యుడి వైపు ఆశగా చూశాడు. ఆంజనేయులు తనవైపు పరిశీలనగా చూడటాన్ని స్పష్టంగా గమనించాడు రాఘవయ్య.

దాదాపు తోసేసినట్లు కిందికి దించటంతో తూలిపడ్డాడు రాఘవయ్య. ఆయన చేతుల్లోని శాలువా, పూలమాల ఎగిరి అవతల పడ్డాయి.

అప్పుడు కూడా ఆంజనేయులు అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు.

❖ ❖ ❖

గాయపడిన హృదయంతో ఇంటిదారి పట్టాడు రాఘవయ్య. మనసంతా దిగులుగా ఉంది. రాత్రి 11 గంటల వేళ బస్‌స్టేషన్ దిశగా నడుస్తున్నాడు.

ఎవరో సైకిల్‌పై వెళ్తూ– "ఎవరది?" అని గద్దించటంతో రాఘవయ్య తలెత్తి చూశాడు.

ఎదురుగా ఓ కానిస్టేబుల్.

"ఎవరు మీరు? ఎక్కణ్ణించి వస్తున్నారు?" కానిస్టేబుల్ ప్రశ్నిస్తూ దగ్గరగా వచ్చాడు.

రాఘవయ్య ఏమీ మాట్లాడలేదు.

"మీరు... మీరు... రాఘవయ్యగారు కదూ!"

"అవును"

"మాస్టారూ! నేను మాస్టారూ!! గోపీని. మీ దగ్గర చదువుకున్నాను" అంటూ గభాల్న ఆయన పాదాలకు నమస్కరించాడు.

"అలాగా నాయనా, సంతోషం! వయస్సు మీద పడింది కదా, గుర్తించలేకపోయాను."

"ఈ వేళప్పుడు ఎక్కణ్ణించి మాస్టారూ?"

రాఘవయ్య ఏదో చెప్పబోయి, అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకుని "మరేం లేదు గోపీ! చిన్న పనుండి వచ్చాను. పనైపోయేసరికే పొద్దుపోయింది" అన్నాడు.

"ఎలాగూ వచ్చారుగా! దగ్గర్లోనే మా ఇల్లు. ఒక్కసారి వెళ్దాం రండి సార్. బహుశా మీకిప్పుడు లాస్ట్ బస్ కూడా ఉండకపోవచ్చు" అంటూ ఆయన వద్దని వారిస్తున్నా వినకుండా తన వెంట తీసుకెళ్లాడు గోపి.

ఇంటికి వెళ్లగానే భార్యను పరిచయం చేశాడు. ఆమె రాఘవయ్యకు సవినయంగా నమస్కరించింది.

స్నానాలయ్యాక ఇద్దరికీ భోజనాలు వడ్డించిందామె.

"మాస్టారూ... అప్పుడు మీరెంత మొత్తుకున్నా చదువు విలువేమిటో అర్థం కాలేదు. తెలిసొచ్చేసరికి ఇదిగో ఈ కానిస్టేబుల్ ఉద్యోగం తప్ప ఇంకేం దొరకలేదు. అయినా ఫర్లేదు మాస్టారూ! జీవితానికి ఢోకా లేదు. నా పిల్లలిద్దరినీ బాగా చదివిస్తున్నాను. ఏటా మన ఊరి స్కూలులో పేద పిల్లలకు నాకు తోచిన సాయం అందిస్తున్నాను"– అన్నం తింటూ గోపీ చెబుతున్న మాటలు వింటుంటే రాఘవయ్యకు కడుపు నిండిపోతోంది. మనసులోని దిగులు కరిగిపోతోంది. మెల్లగా ఆయన కళ్లల్లో మళ్లీ తేజస్సు వచ్చింది.

ఆ రాత్రి అక్కడే పడుకొని, ఉదయం టిఫిన్ కానిచ్చి బయల్దేరాడు రాఘవయ్య.

"ఒక్క నిమిషం మాస్టారూ" అంటూ గోపి దంపతులు కొత్త బట్టలు, కొంత డబ్బు రాఘవయ్య చేతుల్లో పెట్టి, ఆయన పాదాలకు నమస్కరించారు.

"మాస్టారూ, ఏమిచ్చినా అది గురుదక్షిణ కాలేదు. ఏదో మాకు తోచినంతలో వీటిని సమర్పించుకుంటున్నాం" అన్నాడు గోపీ. రాఘవయ్య కళ్లు చెమర్చాయి.

ఆయన డబ్బును తీసి, గోపీ భార్యకిస్తూ– "అమ్మా! ఇది నా కూతురికి ఇస్తున్న కానుక అనుకో. చీర కొనుక్కో తల్లీ" అంటూ బలవంతంగా ఆమె చేతుల్లో ఉంచాడు.

"చూడు గోపీ! ఏ గురువూ ఖరీదైన వస్తువుల్ని గురుదక్షిణగా కోరుకోడు. శిష్యుడు ఏ హోదాలో వున్నా గురువు పట్ల కాస్తంత గౌరవాభిమానాలు చూపితే చాలు... అదే గొప్ప గురుదక్షిణ. మీరు నూరేళ్లు చల్లగా ఉండాలి" అని ఆశీర్వదించి, అక్కడి నుంచి ఆనందంగా కదిలాడు రాఘవయ్య మాస్టారు.

*(ఆత్మీయ మిత్రుడు గోపిరెడ్డికి కృతజ్ఞతలతో...)*

●